క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కరకాని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వీరాంజనేయులు

ఏలేశ్వరం: అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు కరకాని సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. పట్టణంలోని బాధిత కుటుంబానికి సోమవారం ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ 1995 నుంచి కరకాని కార్మికుల తరఫున అనేక పోరాటాలు చేశారన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన ఆయన మృతి చెందడం బాధకరమన్నారు. సంఘం నాయకులు కుంచే అంజిబాబు, కోనాల వెంకటేశులు పాల్గొన్నారు.

'మున్నూరి' కుటుంబానికి పరామర్శ



అన్నవరంలో నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

అన్నవరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మున్నూరి నాయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయుడు కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, తాటిపాక కృష్ణ, పలివెల కొండలరావు, కొండి సతీష్, గుల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించాలని వినతి

ప్రత్తిపాడు: మండలంలోని బవ్వురువాక గిరిజన గ్రామంలో అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని అసైన్డ్ భూములు ల్యాండ్ మాఫియా, ల్యాండ్ బ్రోకర్ల చేతిలో పడకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కించు జోగిరాజు, కోసూరి దుర్గ, సీహెచ్ సింహాచలం, కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

శంఖవరం: గ్రామంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు స్వామివారిని దర్శించుకుని భక్తులకు వడ్డన చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, పెద్దనాపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పలువురు బాధితులను పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, గొల్లపల్లి సురేష్, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో యువతకు సముచిత స్థానం

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీలో యువతకు సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కత్తిపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా సోమేశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, యువత కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి చేరుకుని గిరిబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సప్పా రాంబాబు, మల్లిపాము దుర్గ, గండు మురళి, గండు బుజ్జి, చల్లా ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఏలేశ్వరంలో పార్టీ నాయకులతో ముద్రగడ గిరిబాబు

బాధిత కుటుంబాలకు ముద్రగడ పరామర్శ

కిర్లంపూడి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సోమవారం పరామర్శించారు. కిర్లంపూడిలో ముద్రగడ రాఘవ, వేలంకలో గండే ఏసుబాబు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను గిరిబాబు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన కత్తిపూడి వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యుత్ ఉద్యోగుల నిరసన



యర్రవరంలో ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



తునిలో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యర్రవరంలో సోమవారం విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేశారు. జగ్గంపేట జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు దశలవారీగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మేన్‌లు అప్పారావు, బాబ్జీ, ఆపరేటర్లు సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తునిలో ఆందోళన

తుని: తమ సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు తునిలో ఆందోళన చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు కొనసాగుతాయని జగ్గంపేట డివిజన్ జేఏసీ ప్రతినిధులు మురళీకృష్ణ, నాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ఏలేశ్వరం: దేశానికి ఇంజినీరింగ్ పునాదులు వేసిన మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. స్థానిక మార్స్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇంజినీరింగ్ విద్యకు పునాది వేసిన విశ్వేశ్వరయ్య నేటి తరానికి మార్గదర్శకమన్నారు. దేశానికి విశ్వేశ్వరయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, మణికంఠ, ప్రీతి, దివ్య, నవ్య తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దుర్గారావు, విద్యార్థులు

బాధితురాలికి న్యాయం చేయాలంటూ ఆందోళన

గోకవరం: అత్యాచారానికి గురైన దళిత బాలికకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేదిలేదని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. గోకవరంలో ఇటీవల అత్యాచారానికి గురైన మహిళకు న్యాయం చేయాలంటూ రాజమహేంద్రవరం కలెక్టరేట్ ఎదుట బాధితురాలి కుటుంబ సభ్యులు, రైతు కూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎయూ, ప్రజా సంఘాల శ్రేణులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం బాధితురాలికి న్యాయం చేయాలంటూ పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రేమ పేరుతో దళిత బాలికను నమ్మించి అత్యాచారానికి పాల్పడిన గాంధీ తన స్నేహితులు కిరణ్‌ను అరెస్ట్ చేసి మరో ముగ్గురిని పోలీసులు పట్టుకోలేదన్నారు. ఈ ఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా స్థానిక తహసీల్దార్ పరామర్శించకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మైనర్ బాలికలకు, మహిళలకు రక్షణ లేదని పదే పదే చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత మైనర్ బాలికలపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, కడితి సతీష్, స్త్రీ విముక్తి జిల్లా కన్వీనర్ డొక్కులూరి సంగీత, రెడ్డి దుర్గాదేవి, చింతపల్లి రత్నం, బొచ్చు ఏసు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దళారులపై చర్యలు తీసుకోవాలి

ఏలేశ్వరం: స్థానిక జగనన్న కాలనీలో ఇంటిపన్ను పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నిర్మించిన జగనన్న కాలనీలో ఇంటి పన్ను పేరుతో కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇస్తే ఇంటి పన్ను వేయిస్తామని, ఇబ్బందులు ఉండవని తమపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ సూర్యప్రకాశరావును వివరణ కోరగా ఇంటి పన్ను విషయమై సచివాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.రమేష్, శిడగం వీర్రాజు, సూరిబాబు, సత్తిబాబు, రమణ, అర్జునరావు, కరీమ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జగనన్నకాలనీ వాసులు

నిర్మాణాలకు నిరసనగా రైతుల ధర్నా

ఏలేశ్వరం: వందలాది ఎకరాలకు సాగునీరు అందించే పంట కాలువలో స్తంభాల నిర్మాణాన్ని నిరసిస్తూ పట్టణంలో సోమవారం రైతులు ధర్నా చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వందలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పంట కాలువలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం స్తంభాల నిర్మాణం చేపట్టారన్నారు. స్తంభాలపై శ్లాబ్ వేసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దీనిపై ట్రాన్స్ కో ఏఈని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ తీరుపై రైతులు మండిపడ్డారు. అనంతరం గ్రీవెన్స్ అధికారి, ఇన్‌చార్జ్ నగర పంచాయతీ కమిషనర్ సూర్యప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సతివాడ వెంకన్న, నోమ్సు సూరిబాబు, కర్రోతు సత్యనారాయణ, కోరాడ బాబు, పైల అప్పన్న, నీలి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. డిసెంబర్ 7వ తేదీన జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకునే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డ్‌లో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్ష రాసే సమయంలో అన్ని ధ్రువ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ. 50 పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రణభేరి బైక్ జాతా ప్రారంభం

తుని/శంఖవరం/జగ్గంపేట: ఆర్థిక, విద్యారంగాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన రణభేరి బైక్‌జాతాను తునిలో ఎమ్మెల్సీ గోపీమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలిరోజు జాతా తుని నుంచి తేటగుంట, అన్నవరం, కత్తిపూడి, పిఠాపురం, కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట మీదుగా ఏలేశ్వరం చేరుతుందన్నారు. ఉపాధ్యాయులు బైక్‌జాతకు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రవిచక్రవర్తి, అరుణకుమారి, శ్రీదేవి, సుభాషిణి, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నగేష్, తూర్పుగోదావరి జిల్లా నాయకులు జయకర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



తునిలో బైక్ జాతాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఒమ్మంగిలో చోరీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో సోమవారం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన గుండ్రపు గనిలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న రూ.లక్ష నగదు, విలువైన బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసినట్టు బాధితురాలు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మీకాంతం తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మురారి శివారులో రాజమహేంద్రవరం వైపు నడుచుకుంటూ వెళుతున్న సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళను వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తునిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుని: స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం అకీరా కంటి ఆసుపత్రి వైద్యులు 112 మందికి కంటి పరీక్షలు చేసి 40 మందిని శస్త్ర చికిత్సకు సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించే వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు రవి, రమ్య, నారాయణ తెలిపారు.

సర్వ సభ్య సమావేశం

పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు త్రిమూర్తులు అధ్యక్షతన శనివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత నెలలో మృతి చెందిన సంఘ సభ్యులు ఎన్వీ రమణారావు, ఈఆర్ఎస్ ప్రకాష్ ఆత్మకు శాంతి కలగాలని అసోసియేషన్ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆంజనేయప్రసాద్, కృష్ణ, అమలరాజు, అప్పలకొండ, వీఎస్ఎన్ రాజు, అప్పలస్వామి, నాగభూషణం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

రామాలయ నిర్మాణానికి సహకరించాలి

రౌతులపూడి: మండలంలోని పారుపాకలో రామాలయ నిర్మాణానికి సహకరించాలని గామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావును కలసి కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. విషయాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ దృష్టికి తీసుకువెళ్లి నిధులు విడుదలకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

రావిచెట్టుకు రక్షణ పనులు పూర్తి

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానంలో తూర్పు రాజగోపురం ఎదురుగా గల రావిచెట్టు (అశ్వత్థ వృక్షం)కు భక్తులు వెలిగించే జ్యోతుల వేడి తగలకుండా అధికారులు చర్యలు చేపట్టారు. చెట్టు కాండం చుట్టూ రేకు అమర్చి రక్షణ కల్పించారు. ఆ పనులు సోమవారంతో పూర్తయ్యాయి. సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు రావిచెట్టు వద్ద నిత్యం వేలాది జ్యోతులు వెలిగించడంతో వేడికి చెట్టు కాండం నల్లగా మాడిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ వృక్షం చనిపోయే ప్రమాదం ఉండటంతో అధికారులు రేకు అమర్చి రక్షణ కల్పించారు.

ముగిసిన కుట్టు శిక్షణ

కోటనందూరు: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గత మూడు నెలలుగా మహిళలకు ఇస్తున్న కుట్టు మెషీన్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీఓ నారాయణ, ఎస్సై రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో మహిళలంతా ఆర్థిక స్వావలంబన సాధించాలని, సమాజంలో పేరు ప్రతిష్టలు సంపాదించాలని సూచించారు.